# నిర్ణయం

లక్ష్మీభారతిరెడ్డి




ప్రతి ఆదివారంలాగే ఈ వారం కూడా శ్రీ గోవిందరాజస్వామి వారి దర్శనం తర్వాత 'కన్య' అనాథాశ్రమం కెళ్ళాను. ఆశ్రమంలోని పిల్లలకంతా నేను వారికోసారొచ్చే బంధువుని కాని బంధువుని. అందుకే నా రాకను గమనించిన పిల్లలంతా నా చుట్టూ చేరారు. తెచ్చిన చాక్లెట్లు ఇతర తినుబండారాలు వాళ్ళకిచ్చి, వారంతా తింటుంటే ఏదో తెలీని తన్మయత్వంతో వారి వంక చూస్తూ ఉండిపోయాను.

తన్మయత్వం అంటే అదో దీపారాధనతో సమానం. తృప్తిగా ఓసారి చూపులు త్రిప్పా ప్రాంగణమంతా. అందరికీ దూరంగా, ప్రత్యేకంగా, ఎవర్నీ పట్టించుకోక సరిగ్గా ఆశ్రమం గుమ్మం ఎదురుగా కూర్చుని ఎవరికోసమో ఎదురు చూపులు చూస్తున్న ఓ మూడేళ్ళ పాప నన్నాకర్షించ దంతో మౌనంగా ఆ పాప వైపు నడిచి–

"ఏం తల్లీ! ఎవరికోసం ఎదురు చూస్తున్నావు?" ప్రేమగా అడిగాను. నా ప్రశ్నకు సైలెంట్ సమాధానంలా ఆ పాప నావైపోసారి చూసి మళ్ళీ తన పనిలో తాను నిమగ్నమై పోయింది.

ఉత్సుకతను ఆపుకోలేక మళ్ళీ అడిగాను.

"అమ్మకోసం" అందా పాప అమాయకత్వం నిండిన స్వరంతో.

క్షణం నివ్వెరపోయి "అమ్మ కోసమా?" అనగలిగాను బలవంతంగా.

"అవును"

అంతే నా గుండెనెవరో అదేపనిగా ఇనుప సూదులతో గుచ్చుతున్న భావన నాలో..

"ఏమ్మా చిట్టీ! మీ అమ్మెవరో నీకు తెలుసా?" అనడిగానే కానీ నా ప్రశ్నలో అర్థం లేదని నాకు స్పష్టంగా తెలిసినా అంతేకదా! అర్థం లేని ప్రశ్నలకు సమాధానాలు రావు. వర్తమానం ఉన్నఫళాన నన్ను గతం గుమ్మంలోకి తోసేసింది నా అనుమతి లేకుండానే.

❋ ❋ ❋

ఆ రాత్రి

అర్ధరాత్రి దాటాక నా భార్య బెడ్ మీద అసహనంగా కదులుతుంటే ఆమెను నావైపు తిప్పుకుని,

"ఏమిటి అమృతా? ఎందుకలా మాటిమాటికీ మెదులుతున్నావ్?" అనడిగా ప్రేమగా.

"కడుపులో బాధగా ఉందండీ, తట్టుకోలేక పోతున్నాను?" అందామె బాధగా.

"సరేలే డాక్టర్ దగ్గరికెళ్దాం" అని నేను లేచి ఆమెనూ లేపి 'వినయ్' నర్సింగ్‌హోంకు చేరుకున్నాం ఆటో పట్టుకుని.

"సారీ! మీ భార్య గర్భ సంచికి ఇన్‌ఫెక్షన్ సోకింది. గర్భ సంచి తీసేస్తేనే మంచిది. లేదా అది ముదిరి ఏకంగా కేన్సర్‌కే దారితీయవచ్చు. ఆపై అసలు మనిషికే ముప్పు" తీరిగ్గా చెప్పింది డాక్టర్ రమణి అవసరం, అనవసరం టెస్ట్‌లన్నీ జరిపాక.

"వేరే మార్గం లేదా డాక్టర్? ఐమీన్ మందులతో నయం అయ్యేలా? మాకు పిల్లలు లేరు" వినయంగా అడిగానామెను.

"మార్గం ఉంటే నేను చెప్పేదాన్నికదయ్యా! కమాన్ ఫాస్ట్ ఏదో ఓ నిర్ణయం తీసుకోండి"

"క్షమించి మళ్ళీ ఓసారి ఆలోచించండి. నా ప్రాబ్లం మీకు చెప్పాను"

"ఏం ప్రాబ్లమయ్యా నీది? ఆ లెక్కన నీ భార్య పోయినా పర్వాలేదా?"

"మీరు కోప్పడుతున్నారు. ఆమెను దక్కించుకోవాలనే నా ప్రయత్నం"

"ఏది?"

"ఖర్చు ఎంతవుతుందో?"

"ఓ 40 వేలు వరకు కావచ్చు"

"మీరలాంటివారని కాదు కానీ 'ఠాగూర్' సినిమా చూశాక డాక్టర్లు ఎంతవరకు పేషెంట్ల జబ్బుకు.. సారీ డబ్బుకు ప్రాధాన్యం ఇస్తున్నారో తెలిసింది".

"అవి సినిమాలండి. ఏదో హిట్ కొట్టాలని లేనిపోని సీన్స్ కల్పించి తీసేస్తుంటారు. అంత మాత్రాన డాక్టర్లల్నందర్నీ అనుమానిస్తారా?"

తర్జనభర్జనల తర్వాత డాక్టర్ మాటలకు తలొంచి నా భార్యను రక్షించుకునేందుకు సిద్ధమైపోయాను. ఎందుకంటే ఆమె లేని జీవితం ఊహించుకోలేక.

❃ ❃ ❃

వారం తర్వాత !

ఏమిటండీ ఇలా జరిగింది ఆ? ఎవరికి ఏ ద్రోహం చేశామని?" భోరుమంది అమృత. ఆమెకెలా చెప్పి ఓదార్చాలో అర్థంకాక కాసేపు మౌనం చేతిలో మైనంగా అరెస్ట్ అయిపోయాను. కొన్ని క్షణాల తర్వాత,

"ఊరుకో అమృతా! జరిగిందేదో జరిగిపోయింది. సంసారంలో పిల్లలు ఓ భాగం మాత్రమే. అంతమాత్రాన పిల్లలు లేందే జీవితం లేదు అనుకోవడం పొరపాటు"

ఏదో ఆమెను ఓదార్చాలనే అన్నానేగానీ ఆ నిజం నన్నూ దహించి వేస్తోంది. ఆమె ఆవేదనకు నా సమాధానం సరైన మందు కాదేమో? అందుకే ఆమె ఇంకా ఏడుస్తూనే ఉంది. మనిషి తనకు తెలీకుండానే ఎన్నోసార్లు ఓడిపోతాడు. ఒక్కోసారి ప్రత్యక్షంగా మరోసారి పరోక్షంగా. ఆ ఓటమికి కారణాలేంటో తెలుసుకునేసరికి కళ్ళ ముందే [illegible] పోతుంది.

❃ ❃ ❃

"థాంక్యూ అంకుల్" అని పిల్లలంతా తలో ముద్దిచ్చేసి వెళ్తుంటే గతంలో నుంచి వాస్తవంలోకొచ్చాను.

ఆ పాప ఇంకా అక్కడే కూర్చుని ఉంది.

"ఏం పేరమ్మా" ఆప్యాయంగా అడిగాను.

"తెలీదు అంకుల్ ఏ పేరు పెట్టి పిల్చినా పలకటం అలవాటు చేసుకున్నాను"

అనాథలు.

కొందరిచేత తయారు కాబడ్డవారు కొందరు. విధి చేసే విచిత్రాల్లో అనాథలుగా మిగిలేది ఎందరో. నా విషయమే తీసుకుంటే... మా గ్రామానికి దగ్గర్లో ఉన్న చిన్న పట్టణానికి మధ్య మధ్యవర్తిగా ప్రవహించే నది చెయ్యేరు. మా ఊరి నుండి ఎందరో ఆ పట్టణానికి పనుల కోసం, అవసరాల కోసం పడవల ద్వారా వెళ్లటం తప్ప రోడ్డు మార్గం లేదు.

ఆ రోజు మా అమ్మా నాన్నలు కూడా పడవద్వారా పట్నం వెళ్తుండగా మార్గ మధ్యలో పడవ గల్లంతై చనిపోయారు.

తల్లిదండ్రులు పోవడం నా దురదృష్టం. ఆ ప్రక్క పట్టణంలో ఎన్నికల ప్రచారానికి మంత్రిగా వచ్చిన రోజే ఈ దుర్ఘటన జరగడంతో పరామర్శకు మా గ్రామానికి వచ్చారాయన. మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం చేశారు. తలిదండ్రుల్ని కోల్పోయిన నన్ను చూసి బాధపడి చొరవ తీసుకుని గురుకులాశ్రమంలో చేర్పించారు. ఆపై నా చదువే నన్ను పైకొచ్చేలా చేసింది. పట్టుదలతో శ్రద్ధగా చదివి నా భవిష్యత్‌కు నేనే బంగారు బాట వేసుకున్నాను.

నేనింకేం ఆలోచించదలచుకోలేదు. సరాసరి ఆ పాపతోసహా ఆ అనాథాశ్రమం హెడ్‌ను కలిసి విషయం చెప్పాను.

"ఆశ్చర్యంగా ఉందండీ. ఇంత వరకు ఈ [illegible] పైగానే పిల్లారులు దత్తతకు నోచుకున్నారు. వాస్తవానికి ముసుగేయకుండా చెప్పాలంటే అందులో ఆడపిల్లల సంఖ్య అతి స్వల్పమే. ఈ కలికాలంలో ఆడపిల్లంటే హడలిపోతున్నారు. పుట్టిన్నాటి నుండి పెళ్ళి చేసేవరకూ ఖర్చులన్నీ కళ్ళ ముందే ఊహించేసుకుంటున్నారు. అందుకే సహనంగా పిల్లలు కలగక దత్తతకు బిడ్డ కావాలని వచ్చే ప్రతివారూ మగపిల్లలకే ప్రాముఖ్యత నిస్తున్నారు.

అలాంటిది మీరీ పాపనే దత్తత తీసుకోవాలనుకోవడం నిజంగా హర్షించదగ్గ విషయం. మీలాగా ఆలోచించగలవారు చాలా అరుదుగా ఉంటారు" అందామె.

"ఏదోలెండి. నాకొచ్చిన ఆలోచనకొద్దీ ఈ నిర్ణయం తీసుకున్నాను. ఆడబిడ్డయినా మగబిడ్డయినా పిలిచేది 'అమ్మా నాన్నా' అనే కదా! కాలానిదేం తప్పుకాదండీ. మార్పు మనిషిలో వచ్చింది. అంతామగబిడ్డలేకావాలంటేఇక వాళ్ళకు పెళ్ళిళ్ళు ఎలా అవుతాయి? ఆడ పుట్టుకను వ్యతిరేకించేవాళ్ళూ పుట్టింది ఓ స్త్రీ మూర్తికే. మన ఆలోచనలు ఇలా పెనురూపాలు ధరిస్తుంటే అంతా ఆడబిడ్డ పుట్టకూడదు అనుకుంటే సృష్టే ఆగిపోయే ప్రమాదం ఉంది. కాస్త ఆవేశంగానే అన్నాను.

"వెల్ సెడ్" ఇంతకూ పాపను ఎప్పుడు తీసుకెళ్తారు?"

"రేపుదయం నా భార్యతో సహా వచ్చి మీ సమక్షంలో అవసరమైన కాయితాల మీద సంతకాలు చేసి, ఇంకా మీ ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసి పాపను తీసుకెళ్తాను" ఆమెతో అని పాప వైపు తిరిగి,

"నువ్వీ ఒక్కరోజు మాత్రమే అనాథవు తల్లీ! రేపట్నుంచి నీకు అమ్మా నాన్నా, వారి ప్రేమానురాగాలు అన్నీ ఉంటాయి" పాపతో చెప్పి తృప్తిగా బైటపడ్డాను. నా అమృత నా మాటను కాదనదన్న ప్రగాఢ విశ్వాసంతో. ❃


చదవండి! చదివించండి!!

ఆటవిడుపు

పిల్లల సచిత్ర మాస పత్రిక

డిసెంబర్ 2004 సంచిక

విజ్ఞాన వినోదాల విపంచిక

